


# జ్ఞానప్రసూన

వులాపు బాలకేశవులు

ఒకసారి పార్వతీదేవి కొన్ని సందేహాలు తీర్చుకోవడానికి తన భర్త అయిన శంకరుని దగ్గరకు వెళ్ళి ఆయనకు సాష్టాంగ నమస్కారం చేసింది. ఈశ్వరుడు చప్పున రెండు చేతులతో పార్వతిని లేవనెత్తి ఎదురుగా వున్న ఆసనం మీద కూర్చుండబెట్టాడు. తర్వాత చిరునవ్వు నవ్వుతూ "దేవీ! ఈనాడు నువ్వు అక్షరాలా పర్వత సార్వభౌముడి పుత్రికలాగే వున్నావు" అన్నాడు.

"ప్రభూ! మిమ్మల్ని ఒక వరం కోరాలని సాత్విక వేషం ధరించి ఇలా వచ్చాను." అన్నది పార్వతి.

"కోరుకో దేవీ!" అన్నాడు శంకరుడు ఎప్పటిలాగే నవ్వుతూ.

పార్వతి కాసేపు మౌనంగా వుండి "మంత్రాలు ఏడుకోట్లు అని ఇంతకుమునుపు మీరే నాతో చెప్పగా విన్నాను. వాటిలో ఏది ఉత్తమమయినది? అలాగే త్రిమూర్తులలో ఎవరు గొప్పవారు? గొప్పవారంటే ఉపాసన చెయ్యదగినవారని అర్థం" అని అడిగింది.

"ఇది వరమా?" అంటూ ఆశ్చర్యాన్ని వెలిబుచ్చాడు ఈశ్వరుడు.

"కాకపోవచ్చు. మొదట మీరు నా సందేహాలు తీర్చారంటే, తర్వాత నేను నా కోరిక బయట పెడతాను" అన్నది పార్వతి.

"అలాగా! సరే విను. నన్ను ఉద్దేశించి చెప్పే పంచాక్షరి ఉత్తమమైన మంత్రం. అందరూ ఉపాసన చెయ్యదగినవాడను నేను." అన్నాడు శివుడు గంభీరంగా.

ఆ మాటకు కాస్త బెదిరినట్టుగా పార్వతి ఆసనంమీద కదిలింది. వెంటనే సర్దుకుని "దేవా! ఆ మంత్రం నాకు ఉపదేశించండి. దానితో మిమ్మల్ని ఉపాసిస్తాను. ఇదే నేను మిమ్మల్ని కోరాలనుకున్న కోరిక" అన్నది.

"ఉపాసనలు నీకెందుకు దేవీ?" అని అడిగాడు శివుడు.

"అయితే నా ముద్దు చెల్లించరా?" అంటూ ముఖం చిన్నబుచ్చుకుంది పార్వతి.

"అది ముద్దుకాదు గౌరీ! కఠోరమైన ఉపాసన. దాన్ని నువ్వు సరిగ్గా చేయలేవు" అంటూ తన అర్ధాంగికి నచ్చజెప్పబోయాడు పరమేశ్వరుడు.

"ఎందుకు చెయ్యలేను?" అని కొంచెం చిరాగ్గా అన్నది పార్వతి.

"డాబూ, దర్పమూ ఉన్నవాళ్ళకి నా మంత్రం పట్టుపడదు. అంతేకాదు. సత్యగుణం కలిగినవారికి మాత్రమే దానిని ఉపదేశించాలి." అన్నాడు శంకరుడు.

పార్వతి విస్తుపోతూ.. "నాలో సత్యగుణం లేదా?" అని ప్రశ్నించింది.

దానికి శివుడు... "గౌరీ! నేనిలా అంటున్నానని బాధపడకు. నీలో సత్యగుణం చాలా తక్కువ స్థాయిలో ఉంది. రాజసమే ఎక్కువ నీలో"

అన్నాడు.

నిజంగానే పార్వతికి చిరాకూ, కోపమూ కలిగాయి. దాంతో ఆమె చివాలున లేచి, "దేవదేవుడవైన నువ్వు నా నాథుడివై ఉండీ, నీ మంత్ర ఉపదేశం పొందడానికి నాకర్హతలేక పోయింది. ఇక నాకెందుకీ జీవితం? నీ పేరు మీదుగా నా ప్రాణాలు విడిచిపెడతాను." అంది.

శివుడు పార్వతిని దగ్గరికి తీసుకుని బుజ్జగిస్తూ.. "సర్వమంగళా! పూజామందిరానికి వెళ్ళు. ఈ రోజంతా మౌనాన్ని పాటించు. రేపు తప్పక పంచాక్షరి ఉపదేశిస్తాను." అని వెళ్ళిపోయాడు.

పార్వతి పూజామందిరానికి వెళ్లి పద్మాసనం వేసుకుని కూర్చుంది. ఆ మందిరానికి వెలుపలనున్న ఓ మండపం మీద కూర్చున్నది ఆమె చెలికత్తె మాలిని. పూజామందిరంలోనున్న పార్వతీదేవిని పలకరించడానికి మాలినికి ధైర్యం చాలడం లేదు. సుమారు మధ్యాహ్నం అయింది. అంతవరకు కదలక, మెదలక, పెదవి కదల్చక, కళ్ళు మూసుకుని కూర్చునున్న పార్వతి నెమ్మదిగా కళ్ళు తెరచి, అటూ ఇటూ చూసింది. ముఖం సగం చూపిస్తూ మండపం మీద కూర్చున్న మాలిని కనిపించింది. వెంటనే.. "మాలినీ!" అంటూ పిలిచింది పార్వతీదేవి. తక్షణం మాలిని పూజా మందిరంలోకి పరుగెత్తుకొచ్చి "ఏమిటమ్మా?" అని అడిగింది వినయంగా.

"మాలినీ! నా ఈ రూపంతో, అందచందాలతో ఈశ్వరుణ్ణి వశం చేసుకున్నాను కాదటే! వీణ మ్రోగుతున్నట్టు నా కంఠం పలుకుతూంటే నీలకంఠుడు వశుడుకాక ఊరుకోగలడటే. ఏమంటావే?" అని కాస్త గర్వంగా అడిగింది పార్వతి.

అందుకు మాలిని ఏదో బదులు చెప్పబోయేంతలో.."గౌరీ! అంటూ గర్జించి చరచరా నడిచివచ్చి, పార్వతి ఎదుట నిల్చున్నాడు ఈశ్వరుడు.

రుద్రుడిలాగా మారిపోయి తన ఎదుటికొచ్చి నిల్చున్న భర్తని చూస్తూ గజగజ వణికిపోసాగింది పార్వతి. మాలిని బల్లిలాగా గోడకి అంటుకుపోయింది.

పరమేశ్వరుడు కళ్ళనుండి నిప్పులు రాలుస్తూ.. "వ్రతభంగం మాట అలా ఉంచు గర్విష్టురాలా! నేను నీ అందచందాలకు వశమయ్యానా? కొండ కూతురివి కావడంతో నీ బండతనం బయటపెట్టుకున్నావు. సత్యగుణం నీలో తక్కువని మెత్తమెత్తగా చెబితే విన్నావా? ప్రాణాలు నా పేరు మీదుగా ధారబోస్తానని అన్నావే! నా మాటల మీదా, మంత్రం మీదా నీకు ఏ మాత్రం భక్తి విశ్వాసాలు ఉండివున్నా మౌనవ్రతం విడిచి ఇంత గర్వంగా మాట్లాడలేవు. నీ అహంకారానికి తగిన ఫలితం అనుభవించు, సహజమైన జరామరణాలుగల మానవ శరీరం ధరించి భూలోకంలో పడివుండు-" అంటూ ఘోరంగా శపించాడు.

పార్వతి రోదిస్తూ భర్త పాదాలమీద పడింది. కన్నీటితో పతిదేవుని పాదాలను అభిషేకించింది. "దయానిధీ! మన్నించు. బుద్ధి వచ్చింది. దయతో ఈ పాదదాసిని క్షమించి, శాపాంతాన్ని అనుగ్రహించు" అని వేడుకున్నది.

పార్వతి ప్రార్థనకి కరిగిపోయిన శివుడు.."దేవీ! నీతోబాటూ నేనూ తొందరపడ్డాను. అయినా నామాటకి తిరుగులేదు. శాపాంతాన్ని తెలియజేస్తాను విను. భూలోకంలో దక్షిణదేశాన శ్రీకాళహస్తి అనే పుణ్యక్షేత్రం ఉంది. అక్కడ నేను లింగరూపంలో ఉంటున్నాను. ఈ నీ శరీరం అక్కడ మారేడు చెట్టు అవుతుంది. ఈ నీ అవయవాలే ఆ చెట్టు ఆకులు. అవి ప్రతి నిత్యమూ నామీద పడుతూ వుంటాయి. నువ్వు మానవకాంతవై. అక్కడ నన్ను సేవిస్తూ తపస్సు చేస్తూఉండు. నీకు నా మంత్రోపదేశం లభిస్తుంది. అది కొన్నాళ్లకి సిద్ధి పొందుతుంది. దాంతో ప్రసూనం (పుష్పం) వికసించినట్టు నీకు జ్ఞానం వికసిస్తుంది. నీకు జ్ఞానప్రసూనాంబిక అనే దివ్యనామం వస్తుంది. నిన్ను భక్తులందరూ సేవిస్తారు.

ఇప్పటిలాగే అప్పటినుంచీ నీకు పూజలు జరుగుతాయి. జరిగినదానికి విచారించకు, వెళ్ళు" అన్నాడు. వెంటనే పార్వతి తన పతిదేవునికి ముమ్మారు ప్రదక్షిణంచేసి, మానవరూపంతో భూలోకం చేరుకుంది. ఈశ్వరుడు చెప్పిన విధంగా శ్రీకాళహస్తి క్షేత్రానికి వచ్చి తపస్సు చేసింది. కొంతకాలం గడిచింది.

శివుడు ఒక ముసలి భక్తుని రూపంలో శ్రీకాళహస్తి క్షేత్రాన్ని చేరుకొని, పార్వతికి, శివపంచాక్షరి ఉపదేశించాడు. ఆ మంత్రాన్ని పార్వతీ దేవి నియమనిష్ఠలతో జపించి సిద్ధి పొందింది. ఆ దేవియే శ్రీకాళహస్తి క్షేత్ర దేవత జ్ఞానప్రసూన. ❋


పై వారమే....

## దసరా సంచిక

ముఖచిత్రం : విజయదుర్గ

**ప్రత్యేక వ్యాసాలు, శీర్షికలు, కార్టూన్‌లు, మిగతా మామూలు శీర్షికలన్నింటితో ఆకర్షణీయంగా వెలువడుతుంది!**


